# భానుమూర్తి నవ్వాడు!

గంగుల నరసింహారెడ్డి

భానుమూర్తి గురించి తెలిసిన వాళ్ళందరికీ అతనో చిత్రం మనిషి. మీకు తెలిస్తే మీరూ ఒప్పుకుంటారు ఇది నిజమేనని, పైగా ఎంతో ఆశ్చర్యపడిపోతారు కూడా.

భానుమూర్తి పుట్టినప్పుడు అందరి పిల్లల్లా కెరుకేరుమంటూ ఏడవలేదు. కిలకిలా నవ్వాడనుకున్నారా. ఉహూ, కానే కాదు, మౌనంగా, స్తబ్దంగా ఉండిపోయేడు.

మంత్రసానికి పిల్లాడు 'స్టిల్ బర్త్' ఏమోననే అనుమానం వచ్చింది. ఎగదీసుకుంటున్న శ్వాసను పట్టి బ్రతికి ఉన్నవాడేనని నిర్ధారించుకుంది.

వాడు ఎంతసేపటికి ఏడవకపోయేసరికి గట్టిగా గిల్లింది ఆవిడ. అప్పటికీగాని నోరు విప్పలేరు మనవాడు.

అడపా దడపా ఎప్పుడయినా ఏడ్చేవాడేమోకాని వాడు ఎన్నడూ నవ్వినపాపాన పోలేదు. తల్లికి వాడు నవ్వితే చూడాలని కోరిక ఎన్నడూ తీరనేలేదు.

వాడికి ఎన్నో ఆటవస్తువులు కొనుక్కొచ్చే వాడు తండ్రి. చిత్రమైన ఆ బొమ్మల్ని చూసయినా పెదాలు విప్పక పోయేవాడు.

వాడిని నవ్వించాలని తల్లి వాడి చంకల్లో చక్కిలిగింతలు పెట్టేది, అరికాలును గోటితో గీకేది. వాడి కడుపుపై నోరుంచి 'బర్ర్'మనే శబ్దం పుట్టించేది. తను రకరకాల కోతి చేష్టలు చేసేది, ఎన్ని విధాలా ప్రయత్నించినా ఆమెకు ఓటమే ఎదురయ్యేది.

ఊరికి వచ్చిన సర్కస్‌కు, తోలుబొమ్మలాటకు పనిగట్టుకొని తీసికెళ్ళేది. జోకర్ బొమ్మలను చూపించేది- ఉహూ--పిల్లాడు నవ్వనే నవ్వడే! ఆమె ఒకవేళ ఓ మహారాజుకు పట్టమహిషి అయుంటే తన కొడుకును నవ్వించిన వాడికి అర్ధరాజ్యం ఇస్తానని ప్రకటించి ఉండేది.


భానుమూర్తి పెరిగి పెద్దవుతున్నాడు. వాడిని ఒడిలో వేశారు. అనతికాలంలోనే భానుమూర్తి ప్రత్యేకత అందరికీ తెలిసిపోయింది.

బడిపిల్లలు కూడా వాడిని నవ్వించాలని విశ్వప్రయత్నం చేశారు. "ఒక్కసారి నవ్వరా. నీకు చాక్‌లెట్లు ఇస్తాంరా, అవి ఇస్తాంరా, ఇవి ఇస్తాంరా" అని ఆశలు పెట్టడమే గాకుండా దీనంగా అడుక్కునేవారు. రౌడీ పిల్లలుంటారుకదా, వాళ్ళయితే "ఒరేయ్ నవ్వరా లేకపోతే ఎముక విరగ తంతాం" అని బెదిరించడమే గాకుండా ఒకటి రెండు దెబ్బలు కూడా వేసేవారు. కాని లాభంలేక పోయింది.

వాణ్ణి నవ్వించకపోయినా ముఖంలో సంతోషపు రేఖలయినా చూద్దామని స్కూలు టీచర్లు ఒకటి రెండుసార్లు వాడికి ఫస్టుమార్కులు కూడా వేశారు. ఉదాసీనతే కన్పించేది వాడిలో.

ఎస్సెస్సీలో ఫస్టుక్లాసులో పాసయ్యేడు.

హాస్యకథల పోటీలో




# ఎన్నికయిన కథ

అప్పుడూ నవ్వనేలేదు.

కాలేజీలో చేరాడు.

అక్కడా ఓ వెలుగు వెలిగాడు.

విద్యార్థులకు, లెక్చరర్లకు అందరికీ తెలిసిపోయింది భానుమూర్తి విషయం.

"ఫిలాసఫర్" అని అందరూ అతనికి ఓ నిక్ నేమ్ తగిలించారు.

ప్రతివాడూ పోటీపడి అతన్ని నవ్వించడానికి ప్రయత్నించేవాడు.

ఎందరో పొట్టచెక్కలయ్యేట్టు నవ్వడానికి కారణమైన జోకుల్ని ప్రత్యేకంగా రాసుకొని వచ్చి భానుమూర్తికి చెప్పేవారు. ప్రసిద్ధ కార్టూనిస్టుల కార్టూనులు తీసుకొచ్చి చూపించేవాడు.

కొందరైతే అతన్ని నవ్వించాలనే పట్టుదలతో తమ సొంత ఖర్చుమీద రాజబాబు, మాడాబు నటించిన సినిమాలకు తీసికెళ్లారు. పాతవి రేలంగి సినిమాలు వచ్చాయంటే దానికీ తీసుకెళ్లారు... ప్చ్!

దేవన్‌వర్మ, మహమూద్, అస్రానీలు నటించిన హిందీ సినిమాలకు పట్టకెళ్ళారు— ప్చ్! ప్చ్!!

ఇలా అయితే లాభంలేదని లారల్ హార్డీల సినిమాలను కూడా చూపించారు. ప్చ్! ప్చ్!! ప్చ్!!!

'అయ్యో రేలంగి, చాప్లిన్ మీ అవార్డులన్నీ ఎందుకు కొరగాకుండా పోయాయే!' అని తీసుకెళ్ళినవారు వాపోయేవారు.

అమితాబ్ బచ్చన్ కంటె ఎక్కువ సీరియస్‌గా కనిపిస్తాడని సినిమా అభిమానులు అతనికి "సీనియర్ అమితాబ్" అని పేరు పెట్టమన్నారు.

కాలేజీలోని అందరికీ అతనో సమస్యగా తయారయ్యాడు.

ఓ విద్యార్థి అయితే తను సైకాలజీలో ఎం.ఎ. చేసి—భానుమూర్తి నవ్వడెందుకు? అనే విషయంపై పి.హెచ్.డి. చేసి డాక్టరేట్ పట్టా పొందుతానని ప్రకటించి భానుమూర్తి మనస్తత్వాన్ని అర్థం చేసుకోవడానికి అతని స్నేహితుడిగా కూడా మారాడు.

అటువంటి గొప్ప పరిశోధన చేసినందుకు అతనికి నోబెల్ బహుమతి కూడా రావచ్చేమోనని కొందరు అనుమానపడుతూ అసూయ పడసాగారు.

ఓ విద్యార్థి తన తోటి విద్యార్థినిని మహా ఘోరంగా ప్రేమించేసి తనను పెళ్ళి చేసుకోమని అర్థించాడు. అందుకు ఆ అమ్మాయి "నీవు భానుమూర్తిని ఓమారు నవ్వించనట్లయితే నీ కోరిక తప్పక తీరుస్తాను" అని షరతు పెట్టింది.


"కావాలంటే సిటీ బస్సును రన్నింగ్ క్యాచ్‌లో ఎక్కి ఫుట్‌బోర్డుపై వ్రేలాడుతూ ప్రయాణించగలను. క్యూలో గంటల తరబడి నిలబడి థియేటరు టికెట్ తెమ్మంటే తేగలను, సెకండ్ షో సినిమా నుంచి వస్తూ పోలీసుల బారినపడి నిన్ను కాపాడుకోగలను. నీవు వంట పుస్తకాలను చూస్తూ చేసిన వంటలను తినగలను గాని భానుమూర్తిని నవ్వించడమనే విషయం మాత్రం నాకు చేతగాదు బాబోయ్" అని వేడుకున్నాడా అబ్బాయి.

"నీకు చేతకాకపోతే నీకూ నాకూ కుదరదు" నిక్కచ్చిగా చెప్పేసిందా అమ్మాయి.

తరువాత ఆ అబ్బాయి భగ్న ప్రేమికుడై, తన ప్రేమ ఫలించక పోవడానికి కారకుడైన భానుమూర్తిపై పగపట్టి ఓరోజు అతన్ని చంపాలని విఫలయత్నం చేసి జైలుకెళ్ళి ఆ తరువాత పిచ్చాసుపత్రికి వెళ్ళాడు.

ఇంకే అమ్మాయిలైన ఇలాంటి షరతే పెట్టొచ్చని అనుమానపడి భయపడిన చాలా మంది విద్యార్థులు ప్రేమించడమే మానేశారు. ప్రేమిస్తున్న వారు మధ్యలోనే విరమించుకున్నారు.

ఇదిలా వుండగా కాలేజీ బ్యూటీగా పేరొందిన, చాలా మంది యువకులను రాత్రి పూట సరిగా నిద్రపోనీయకుండా చేస్తున్న శ్రీలత అనే అమ్మాయి భానుమూర్తి స్పెషాలిటీవంక ఆకర్షితురాలై, అతన్ని




అభిమానిస్తూ ఓ సుముహూర్తాన గాఢాతిగాఢంగా ప్రేమించేసింది.

ఆ విషయం అతనితో చెప్పేస్తే ఎగిరి గంతేయక 'అలాగా' అని ఊరుకున్నాడు నిర్లిప్తంగా. అందాకా శ్రీలతను ప్రేమిస్తున్న చాలామంది భానుమూర్తివంక గుర్రున చూడసాగారు.

ఈ విషయం ఆనోటా ఈనోటా శ్రీలత తల్లిదండ్రులదాకా వెళ్ళింది. ఓ రోజున ఆమెను నిలదీసి అడిగాడు ఆమె తండ్రి.

"అవును, భానుమూర్తిని నేను ఈ ప్రపంచంలో ఎవ్వరూ ప్రేమించలేనంతగా ప్రేమిస్తున్నాను. పెళ్ళి చేసుకుంటే అతన్నే చేసుకుంటాను" అని ఖండితంగా చెప్పేసింది.

ఆ అమ్మాయి తండ్రి మహా ఉద్దండుడు. పెద్ద గడుసు పిండం కూడానూ.

"అమ్మాయ్, భానమూర్తి అంతటి వాణ్ణి చేసుకుంటానంటే మేం వద్దంటామా, కాని అతనితో కాపురం చేస్తే నీవూ కొన్నాళ్ళకు నవ్వడం మరచిపోతావేమో, అందుకే భానుమూర్తిని రెండు నెలలలోగా నీవు ఓ మారు నవ్వించగలిగితే మీ ఇద్దరికి ఆకాశమంత పందిరేసి పెళ్ళి చేస్తాను" అనే షరతు పెట్టాడు.

చేసేదిలేక ఆమె ఒప్పుకొని భానుమూర్తిని కలిసి ఈ విషయమంతా చెప్పి "భానూ నేనంటే నీ కిష్టంలేదా?" అని అడిగింది జాలిగా.

"ఎందుకు లేదూ బోల్డంత ఉంది"

"మరి నా కొరకయినా ఒకే ఒక్క మారు నవ్వవూ - భానూ - ప్లీజ్" అంది దీనంగా.

"ఏం చేద్దును లతా ఎలా నవ్వాలో నాకు తెలీదే?" అంతకన్నా దీనంగా అన్నాడు.

"ఇదుగో ఇలా నవ్వాలి" అంటూ తను నవ్వింది.

అలా ఆమె బలవంతాన పగలబడి నవ్వుతుంటే అతను ఆమెను అలాగే చూస్తూ ఉండిపోయాడు.

అతను ఎంతకూ నవ్వకపోయేసరికి, నవ్వుతూనే ఆమె అతన్ని కితకితలు పెట్టింది, ఏమో చేసింది. కాని ప్రయోజనం లేకపోయింది.

ఆమె నవ్వినవ్వి అలసి, వెంటనే కోపం తెచ్చుకుని అతల్ని గట్టిగా కొట్టి "దుర్మార్గుడా" అని నోటికొచ్చినట్లు తిట్టి బిగ్గరగా

పడవసాగింది. ఆమెతో బాటు తనూ మౌనంగా రోదించసాగాడు భానుమూర్తి.

తరువాత ఆమె తనకు తోచిన ప్రయత్నాలన్నీ చేసింది. కాని అన్నీ విఫలమైనాయి.

తండ్రి పెట్టిన గడువు పూర్తి కావస్తోంది.

చివరి ప్రయత్నంగా అతన్ని నగరంలో పేరు మోసిన గొప్ప సైకియాట్రిస్టు దగ్గరికి తీసికెళ్ళింది.

"ఓ, ఎప్పుడూ నవ్వని గ్రేట్ భానుమూర్తి అంటే మీరేనా, మీ కేసు నాకు రావడం నిజంగా నా అదృష్టం" అని అతన్ని కౌగలించుకున్నంత పని చేశాడు. (అప్పుడు శ్రీలత కళ్ళు మూసుకుందిలెండి) మీ అంతరంగపు లోతులకు వెళ్ళి (అమ్మ బాబోయ్!) ఓ పేపరు రాసేసి త్వరలో జరుగబోయే ప్రపంచ మనస్తత్వ శాస్త్రజ్ఞుల సమావేశంలో చదువుతాను" అని అతను మహా సంబరపడి పోతుండగానే ఎక్కడినుంచి వచ్చాడో ఏమోగాని భానుమూర్తిపై థీసిస్ రాసి డాక్టరేట్ సంపాదిద్దామనుకున్న విద్యార్థి అక్కడ ప్రత్యక్షమయ్యాడు.

"భానుమూర్తి పూర్తిగా నా కేసు. మీరు టేకప్ చేయడానికి వీల్లేదు" బల్లగుద్ది అన్నాడు.

"నాదగ్గరికి వచ్చిన ఇతన్ని నేను వది లేది లేదు" అంటూ భానుమూర్తిని చేయి పట్టుకున్నాడు.

"నా సబ్జక్టును తన్నుకుపోతానంటే నే నూరుకుంటావా" అంటూ ఆ విద్యార్థి అతని ఇంకో చేయి పట్టుకు లాగాడు.

కొంతసేపు ఇద్దరూ అతన్ని చెరోవైపుకు లాగేసరికి అతనికి ప్రాణం పోయినంత పనయింది.

"మీ రిసెర్చి పాడుగానూ, నన్ను వదిలేయండి బాబోయ్" అంటూ గింజుకున్నాడు, శ్రీలత కలగజేసుకొని వారిద్దరి బారినుంచి అతన్ని ఎలాగో విడిపించింది.

తరువాత ఆ డాక్టరూ, విద్యార్థీ చేయి చేయి కలుపుకొని భీకరంగా కొట్లాడుకోసాగారు. 'ఇక్కడుంటే ప్రమాదం' అనుకొని ఇద్దరూ బయటకు పరిగెత్తారు

అయిపోయింది, రెండు నెలల గడువు పూర్తయింది.

శ్రీలత చిత్తుగా ఓడిపోయింది. ఆమె తండ్రి విద్విలాసంగా నవ్వి ఆమెకు వెంటనే ఓ సంబంధం కుదిర్చి అర్జంటుగా పెళ్ళి చేసేశాడు.

భానుమూర్తి చదువు పూర్తియింది.

తరువాత పెళ్ళయింది.

ఆ తరువాత కొన్ని రోజులకు ఉద్యోగం కూడా దొరికింది. అతని ఆఫీసులో కూడా అతని గురించి అందరికీ తెలిసి పోయింది.

మొదట్లో భానుమూర్తిని నవ్విస్తామని వాళ్ళు ఒకరి కొకరు పందాలు వేసుకొని అతన్ని చిత్రహింసల పాలు చేసేవాడు. ఒక అతను తెలివి పరుడు భానుమూర్తిని నవ్వించాలనే పట్టుదలతో 'తను చనిపోవడానికి కారణం భానుమూర్తి' అని రాసిన కాగితాన్ని చేతిలో పట్టుకొని, మూర్తిని బెదిరిస్తూ 'ఒరేయి నేను చస్తే నిన్ను ఉరికంబం ఎక్కిస్తారు,' అందు కయినా ఓ మారు నవ్వరా. నీవు నవ్వితే చావను' అని ఆఫీసులోనే ఉరి వేసుకోబోయాడు. కాని భానుమూర్తి చలించలేదు. సహ ఉద్యోగులు కలసి వాణ్ణి రక్షించారు.

తరువాత ఇంకెవరూ భానుమూర్తిపై పందాలు కాయలేదు.

భానుమూర్తి గురించి క్రమంగా ప్రపంచమంతా తెలిసి పోయింది. 'వింతలు విశేషాలు' శీర్షికలో అన్ని పత్రికల వారు అతని గురించి రాశారు.

ప్రపంచం మొత్తం మీద నవ్వంటే తెలియని ఏకైక వ్యక్తిగా భానుమూర్తి పేర్లను 'గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో ఎక్కించాలని ప్రపంచంలోని అన్ని పత్రికలకు ఉత్తరాలు రాశారు. మన దేశానికి ఆ మాత్రమైనా 'క్రెడిట్'

రావాలని దేశం (దుర)భి మానులు అతని పేరు అందులో రాయకపోతే నిరాహార దీక్ష కూడా చేస్తామని బెదిరించారు

మరణశిక్ష విధించబడ్డ నేరస్తులు ఎవరైనా మీ ఆఖరు కోరిక ఏమిటని అడిగితే 'భానుమూర్తి నవ్వితే చూడాలి' అనే తీర్పురాని కోరిం కోరతారనే భయంకొద్దీ ఆ నేరస్తులను 'భానుమూర్తిని నవ్వితే చూడాలనే కోరిక తప్ప ఇంకేదయినా సరే మీ ఆఖరుకోరిక ఏమిటని' అడగసాగారు పోలీసులు


ఇదిలా ఉండగా ఒకనాడు భానుమూర్తిని సాయంత్రం ఒక వ్యక్తి కలిశాడు అతడు చెప్పినది విని భానుమూర్తి నివ్వెరపోయాడు

"నేను ఫలానా 'ఎక్స్' దేశానికి చెందిన ఏజంటును మీ రెందుకు నవ్వలేక పోతున్నారో తెలుసుకునేందుకు మా శాస్త్రజ్ఞులు మీపై పరిశోధని చేయాలను కుంటున్నారు మీ భార్యా పిల్లలకు లక్షాలర్లు ఇస్తాము మీరు మా దేశానికి రావాలి"

"నన్ను ఆలోచించుకోనివ్వండి" అంటూ ఆ క్షణానికి తప్పించు కున్నాడు

ఇదిలా ఉండగా భానుమూర్తి విషయం తెలిసి, అతన్ని పరాయి దేశాలు సంగ్రహించాలని ప్రయత్నిస్తున్నాయని గ్రహించి మన దేశ మంత్రి వర్గం అత్యావసరంగా ఆ పూట సమావేశమయింది

'భానుమూర్తి మన మాతృదేశపు ఆస్తి. అతన్ని కోల్పోవడం మన దేశానికి పెద్ద దెబ్బ, అతన్ని మన శాస్త్రజ్ఞులే పరిశోధించాలి' అని తీర్మానించి అప్పటికప్పుడు అందుకు కావలిసిన ఏర్పాట్లు చేసింది



# కోరిక

సుళ్ళు తిరుగుతున్న కాలంలో
సుదీర్ఘ రూపమైన
విశ్వంలో
బుద్ధిని బెదిరించి
సిగ్గుని కప్పెట్టిన
పాత్రలో మానాన్ని
మరిగించాను
కాలాన్ని జయించాను.

**చిన్నిబదిరి కేశవరావు**

---

భానుమూర్తి ప్రాణభయంతో పరిగెత్తుతున్నాడు. అతని వెనుక విదేశీయులే గాక మన దేశపు రక్షక దళంకూడా వెంటాడుతున్నారు.

జనం ఇదంతా సినిమా షూటింగేమోనని ఆసక్తిగా, వింతగా తొంగి చూస్తున్నారు.

భానుమూర్తి ఇక పరిగెత్తలేక పోయాడు. అతనికి అలసట వచ్చేస్తుంది. ఒక చౌరస్తాలో ఆగిపోయాడు. రొప్పుకుంటూ అక్కడో విగ్రహం చాటుని నక్కాడు.

నలువైపుల నుండీ అతన్ని పట్టుకుపోవాలని వాంఛిస్తున్నవారు కమ్ముకురాసాగారు. తమకంటె భానుమూర్తికి దగ్గరగా వెళ్లున్న వారిని శత్రు దేశస్తులు కాల్చి చంపేస్తున్నారు. అందరిదృష్టీ భానుమూర్తి పై కేంద్రీకరింపబడి ఉంది.

నాలుగురోడ్లకూడలిలో సంకుల సమరం మొదలైంది. కేవలం ఒక వ్యక్తి కోసం—అదీ అతను ఓ గొప్ప శాస్త్రజ్ఞుడు కాదు, ఓ ప్రముఖ రాజకీయ వేత్తనయినా కాదు. ఓ విప్లవ వీరుడయినా కాదు. కేవలం నవ్వంటే తెలియని భానుమూర్తి కోసం అందరూ పోటీ పడుతున్నారు. తామే అతని బుర్రను ఛేదించి అతనెందుకు నవ్వడం లేదో కనుక్కోవాలని తహతహలాడుతున్నారు.

అయోమయంగా, బిత్తరపోయి, ప్రాణాలరచేత బెట్టుకొని నలువైపులా కలయచూశాడు భానుమూర్తి. అప్పుడతనికి తల్లిదండ్రులూ, తనను ప్రేమించి విఫలమైన శ్రీలతా ఆతరువాత తన భార్యా పిల్లలూ జ్ఞాపకం వచ్చారు.

అతి సామాన్యుడైన తన కోసం అగ్రరాజ్యాలు సైతం పోటీ పడుతున్నాయి. తనను తీసికెళ్ళి ఏం చేస్తారో?! తల పగలకొట్టొచ్చు. కపాలాన్ని బ్రద్దలు కొట్టి మెత్తగా ఉండే తన మెదడులోకి బహుశా సెరిబ్రమ్‌లోకి కత్తిని....కత్తెరను....ఫోర్‌సెప్స్‌ను జొనిపి, సూక్ష్మాతి సూక్ష్మమైన నాడులను వెలికి తీసి....అబ్బా!

తను నవ్వలేక పోయినంత మాత్రాన ఇలా చేస్తారా ఈ పిచ్చి మనుషులు........ నిజంగానే పిచ్చి మనుషులు....... పిచ్చి....

ఉన్నట్టుండి అతను పెద్దగా నవ్వాడు!

భానుమూర్తి నవ్వాడా?

నిజంగా భానుమూర్తి నవ్వాడా?!

అవును, ఎన్నడూ నవ్వని భానుమూర్తి నిజంగానే ఆ తుపాకి శబ్దాల కన్నా పెద్దగా నవ్వాడు!!

రైఫిల్స్ చప్పుడు అత్యంత ఆశ్చర్యకరంగా ఆగిపోయింది, అందరూ చల్లగా జారుకుంటున్నారు. మనవాళ్ళు మాత్రం అతని వంక చిత్రంగా చూస్తున్నారు.

అలా నవ్వడం ప్రారంభించిన భానుమూర్తి మాత్రం ఇప్పటికీ అలానే నవ్వుతున్నాడు విరామం లేకుండా!!! ■